
పి.గన్నవరం మండలం జి.పెదపూడిలంకలో వరదనీట మునిగిన అరటితోట


పి.గన్నవరం మండలం బెల్లంపూడికి పడవపై వస్తున్న లంక గ్రామాల ప్రజలు


అప్పనరామునిలంక మధ్యగ్రూపులో వరద నీటిలో ప్రాథమిక పాఠశాల

# లంకలకు ఉపశమనం

- తగ్గుముఖం పట్టిన వరద ఉధృతి
- బయట పడుతున్న రహదారులు
- ఊపిరి పీల్చుకుంటున్న గ్రామాలు

**పి.గన్నవరం:** మండలంలోని వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. శనివారం సాయంత్రం కె.ఏనుగుపల్లి, జి.పెదపూడి ఏటిగట్టు దిగువన ఉన్న రహదారులు వరద ముంపు నుంచి బయట పడటంతో రాకపోకలు ప్రారంభం అయ్యాయి. మానేపల్లి శివారు శివాలయంకకు వెళ్లే రహదారి మాత్రం వరద ముంపులోనే ఉంది. దీంతో అక్కడ ఏర్పాటు చేసిన ట్రాక్టర్ పైనే రెండు కిలోమీటర్ల మేర ట్రాక్టర్‌పైనే ప్రజలు శివాయలంకకు వెళ్తున్నారు. మొండెపులంక శివారు పుచ్చల్లంకకు వెళ్లే రహదారి ఇంకా ముంపులోనే ఉంది. వరదలతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పడవలు దాటి బయటి గ్రామాలకు వచ్చి సరకులు తీసుకువెళ్తున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలతో పాటు, జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతి కొనసాగుతోంది. లంక భూముల్లోని పంటలన్నీ వరద నీట మునిగి పాడైపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లంకల నుంచి ఏటిగట్లపైకి తరలించిన పశువులకు మేత లేకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.


అయినవిల్లిలంకలో వరద నీటిలో మునిగిన పోకతోట

**నిలకడగా గోదావరి**

**ఆలమూరు:** ఇప్పటివరకూ ఉరకలెత్తిన గౌతమీ గోదావరి ప్రస్తుతం నిలకడగా ఉంది. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లోని రైతులు అప్రమత్తమయ్యారు. పశువులను, వ్యవసాయ పనిముట్లను బయటకు తరలిస్తున్నారు. అధికారుల ఏటిగట్ల వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. లంక ప్రాంతాల ప్రజలను వరద నుంచి అన్ని విధాలా రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. బడుగువానిలంక నుంచి తోకలంకకు రాకపోకలు స్తంభించిన నేపథ్యంలో అధికారులు పడవలను ఏర్పాటు చేశారు.

**నీటమునిగిన ఇళ్లు, కొబ్బరి తోటలు**

**అంబాజీపేట:** ఎగువ ప్రాంతాల్లో వరద పోటెత్తడంతో వైనతేయ గోదావరి శనివారం ఉధృతంగా ప్రవహించి గ్రామాల్లో ఉండే కౌశికలు ఉరకలు వేస్తున్నాయి. నందంపూడి, వాకలగరువు గ్రామాల్లో ఇళ్లు, కొబ్బరి, అరటి, దొండ పాదులు నీటమునిగాయి. గోదావరి సమీపాన ఉన్న కౌశికలోకి వరద చేరడంతో కాలనీలు, అరటి, కొబ్బరి తోటలను ముంచెత్తుతున్నాయి. నందంపూడి బొంతువారి పేటలో ఆరు ఇళ్లు నీట మునిగాయి. తొండవరం రజకపేటకు వెళ్లే ప్రధాన రహదారి నీట మునగడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


తొండవరం రజకపేటకు వెళ్లే ప్రధాన రహదారిపైకి చేరిన వరద

**కొనసాగుతున్న ఉధృతి**

**సఖినేటిపల్లి:** మండలంలోని టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి గ్రామాల్లో వరద ఉధృతి యథాతథంగా కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టినప్పటికీ, దిగువకు పోటెత్తిన వరద నీరు సముద్రంలోకి దిగడానికి అవరోధంగా మారింది. అమావాస్యకు సముద్రం పోటు సమయం కావడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమవుతోందని స్థానికులు చెబుతున్నారు. సఖినేటిపల్లి లంక పరిధిలోని రేవును ఆనుకుని ఉన్న నివాస గృహాల వద్ద, సఖినేటిపల్లి లాకుపేటలోనూ వరద ప్రవహిస్తోంది. ఏటిగట్టుకు దిగువన టేకిశెట్టిపాలెంలో అగ్నికుల క్షత్రియ కాలనీ ఇంకా జలదిగ్బంధంలో ఉంది. అప్పనరామునిలంకలో పల్లపు ఏరియాలలో వరద ఉధృతి కొనసాగుతోంది. స్థానిక అంబేడ్కర్ సెంటర్ నుంచి టేకిశెట్టిపాలెం వెళ్లే రహదారి వరద నీటిలో ఉంది. సఖినేటిపల్లి రేవులో వరద ఉధృతి కొనసాగడంతో పంటు ప్రయాణాలు నిలిచాయి. ఇదిలా ఉండగా వరద ప్రవాహంపై ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నట్టు స్థానిక అధికారులు పేర్కొన్నారు.

**లంకల్లో పెరిగిన ఉధృతి**

**మలికిపురం:** మండలంలోని లంక గ్రామాలలో శనివారం వరద ఉధృతి పెరిగింది. రామరాజులంక బాడవ, దిండి లంకలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ గ్రామాల్లో నివాస ప్రాంతాలను వరద చుట్టుముట్టింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈ గ్రామాల ప్రజలు ఎత్తులో నిర్మాణం చేసుకున్న నివాస గృహాల్లో ఉండడం వల్ల ఇళ్లలోకి ఇంకా వరద చేరలేదు, వరద మరింత ఉధతమయితే ప్రజలకు మరిన్ని ఇబ్బందులు తప్పవు. తహసీల్దార్ టి.శ్రీనివాసరావు నేతృత్వంలో రెవెన్యూ అధికారులు వరదను పర్యవేక్షిస్తున్నారు. ఏటిగట్ల వద్ద, పెదతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద రక్షణ చర్యలు తీసుకుని పహారా కాస్తున్నారు. లంకలకు వెళ్లే పంట కాలువలకు ఏటిగట్ల వద్ద ఉన్న రెగ్యులేటర్ల నుంచి వరద కాలువల్లోకి రాకుండా కంట్రోల్ చేస్తున్నారు.

## కాజ్‌వేపై కొనసాగుతున్న పడవ ప్రయాణాలు

**అయినవిల్లి:** మండలంలోని ముక్తేశ్వరం–అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వేపై శనివారం సాయంత్రం వరద తగ్గుముఖం పట్టింది. అయితే ఈ కాజ్‌వేపై ఇంకా పడవల్లోనే లంక ప్రజలు రాకపోకలు కొనసాగుతున్నాయి. రెవెన్యూ అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలైన అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక గ్రామాలకు చెందిన ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. వరద బాధితుల కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు రెవెన్యూ, పోలీసు, ఫైర్ సిబ్బంది, వైద్య సిబ్బంది, మత్స్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు సహాయ చర్యలు చేపడుతున్నారు. అలాగే ముక్తేశ్వరం వృద్ధగౌతమిపాయ( తొగరపాయ)లో వరద ఉధృతి కొనసాగుతుంది. పాత వంతెనపై వరద ప్రవహిస్తుంది. వీరవల్లిపాలెం అయినవిల్లి లంక, పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో అరటి, మొక్కజొన్న, తమలపాకు, కోకో, పోక, కూరగాయ పంటలు వరద నీటమునిగాయి.

## టీడీపీ కార్యకర్తలకే ప్రభుత్వ ఉద్యోగాలా?

మాజీ మంత్రి గొల్లపల్లి ధ్వజం

**సఖినేటిపల్లి:** రాష్ట్రంలో టీడీపీ కార్యకర్తలకే ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తూ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచుతుందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సఖినేటిపల్లి మండలం గొంది గ్రామంలో వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈద ఉమామహేశ్వరరావు ఇంటి దగ్గర వైస్ ఎంపీపీ కొల్లాబత్తుల నాని అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి గొల్లపల్లి సూర్యారావు హాజరై పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం జరిగిన సమావేశంలో గొల్లపల్లి మాట్లాడుతూ చదువుకుని ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా.. చంద్రబాబు తన టీడీపీ కార్యకర్తలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ఇస్తానన్న నిరుద్యోగ భృతి ఇవ్వకుండా నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా, సఖినేటిపల్లి మండలం అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, రవిరెడ్డి ఈద, సహదేవ్ తాడి, ఉచ్చుల దాసు, ఇందుకూరి సత్యనారాయణరాజు, అడబాల జానకిరామారావు, గొంది గ్రామ అధ్యక్షుడు ఒడుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

## ముంపు నుంచి శాశ్వత విముక్తి కలిగించండి


అప్పనపల్లి కాజ్‌వేను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

**మామిడికుదురు:** అప్పనపల్లి కాజ్వేను ఆధునీకరించి దానికి ముంపు నుంచి శాశ్వత విముక్తి కలిగించాలని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆయన శనివారం ముంపుబారిన పడిన అప్పనపల్లి కాజ్వేను, పాశర్లపూడిలంకలోని శ్రీరామ్‌పేటను పార్టీ శ్రేణులతో కలసి పరిశీలించారు. గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల బాధితులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలన్నారు. వారికి నిత్యావసరాలు అందించాలని డిమాండ్ చేశారు. వరదల వల్ల పశుగ్రాసం పాడైపోయిందని దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. పసువులకు అవసరమైన గ్రాసంతో పాటు దాణా అందించి రైతులను ఆదుకోవాలన్నారు. వీటిపై ప్రభుత్వం తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పార్టీ నేతలు తోరం గౌతమ్, నెల్లి దుర్గాప్రసాద్, తులా గోపాలకృష్ణ, మట్టపర్తి శివ, పాలమూరి గోపాల్, వాసంశెట్టి రామకృష్ణ, వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.


## వరద పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్సీ


ఎదురుబిడెం కాజ్‌వే వద్ద పడవపై వెళ్లి వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

**అయినవిల్లి:** మండలంలోని ముక్తేశ్వరం–అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శనివారం పరిశీలించారు. బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ వరద కారణంగా లంక గ్రామాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్న ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరద బాధితులకు కనీసం ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. ప్రజలకు తగిన సదుపాయాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బోటు నడిపే వారికి మంచినీళ్లు, ఆహారం అందించడం లేదన్నారు. ప్రభుత్వానికి వరద బాధితుల దుస్థితి కనబడడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం యంత్రాంగం కదిలి వరద బారిన పడిన ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్, విద్యార్థి విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జిల్లెళ్ల రమేష్, ఆకుమర్తి దుర్గారావు, వింటి రాజా, శ్రీరెడ్డి సుబ్బారావు, పడాల పండు, డెక్క బాలరాజు, దొమ్మేటి అర్జున్ తదితరులు ఉన్నారు

## అనారోగ్య బాధితుడికి సాయం

**రావులపాలెం:** అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. గ్రామానికి చెందిన కాకరపర్తి వీర వెంకట రమణ (35) గుండె సంబంధిత వ్యాధితో రెండు నెలల క్రితం ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించుకున్నారు. ఆ తర్వాత కూడా హాస్పిటల్‌కి తరచూ వెళ్లి టెస్టులు చేయించుకోవడానికి, మందులకు చాలా ఖర్చు అవుతుంది. తాపీ పని చేసుకునే ఇతను పనికి వెళ్లే పరిస్థితి లేదు. తల్లి ఒక హాస్పిటల్‌లో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వైద్యానికి ఖర్చు పెట్టే స్తోమత లేక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో వెంకటరమణ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12 వేల చెక్కు అందజేశారు.


బాధితుడికి సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

## రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

**కొత్తపేట:** మండలంలోని పలివెల ప్రధాన వీదిలో అభయాంజనేయస్వామి ఆలయం వద్ద సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆలయ వ్యవస్థాపకుడు విన్నకోట వీఎస్ఎన్ మారుతీబంగారం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం జీఎస్ఎల్ హాస్పిటల్ సౌజన్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కంటి వైద్య నిపుణులు కంటి పరీక్షలు నిర్వహిస్తారని, ఆపరేషన్ అవసరం అయిన వారిని హాస్పిటల్ వాహనంలోనే తీసుకువెళ్లి ఆపరేషన్ చేసి, తిరిగి తీసుకుస్తారని తెలిపారు. శిబిరానికి వచ్చే వారు ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకురావాలని సూచించారు.

## వేదపండితుడు శాస్త్రికి నేడు సత్కారం

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వేదపండితుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న చింతా వేంకటశాస్త్రికి ఆదివారం నర్సాపురంలో వేద, స్మార్త పండిత సభ ద్వారా సత్కారం చేయనున్నారు. వివరాలను ఆయన శనివారం తెలిపారు. ఈ మేరకు నర్సాపురం పట్టణ పురోహితుడు అంగర సత్యనారాయణ, వారి సోదరుల ఆధ్వర్యంలో శాస్త్రిని సువర్ణ హస్త కంకణంతో సత్కారం చేయనున్నారు.

## వికలాంగులపై వేధింపులు తగవు

**సఖినేటిపల్లి:** రాష్ట్రంలో వృద్ధుల, వికలాంగుల పింఛన్లు తొలగించి వారిని వేధించడం తగదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ ప్రతినిధి, రామేశ్వరానికి చెందిన పాటి శివకుమార్ శనివారం అన్నారు. ఈ మేరకు సఖినేటిపల్లిలో ఆయన మాట్లాడుతూ, 2024 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో 67.34 లక్షల పింఛన్‌లు ఉండగా, ఈ ఏడాది ఆగస్టు నెలకి వచ్చే సరికి 62.19 లక్షలకు తగ్గిపోవడంపై ఆయన విరుచుకుపడ్డారు. పింఛన్లలో కోత విధించి వృద్ధులను, వికలాంగులను, మానసిక వికలాంగులను కష్టాలకు గురిచేయడం దారుణమన్నారు. వికలాంగులకు పింఛన్ ఎగ్గొట్టే విధానంలో వారి వైకల్యం శాతం తగ్గించి కూటమి ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు. పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వారంతా నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా వారిని వేధించడం మానాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## పనుల్లో నాణ్యత పాటించాలి

**ఆలమూరు:** రాష్ట్ర ప్రభుత్వ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం జరిగింది. మండల ఇంజినీరింగ్ జేఈ డి.వీరభద్రరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో గ్రామాల వారీగా అభివృద్ధి పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చేపట్టే పనుల ప్రారంభం నుంచి ముగిసే వరకూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పర్యవేక్షణ జరపాలన్నారు. అలాగే ఏ విధమైన లోపాలకు ఆస్కారం ఏర్పడిన సత్వరమే ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించాలని ఎంపీడీఓ రాజు విజ్ఞప్తి చేశారు. అనంతరం విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చినందుకు గాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డులకు ఎంపికైన ఎంపీడీఓ రాజు, జేఈ వీరభద్రరావును ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఘనంగా సత్కరించారు. సూపరింటెండెంట్ ఎం.మెహెర్ ప్రకాష్, జేఈ షేక్ వలీ, పీఎస్‌సీఎస్ అధ్యక్షుడు ఈదల వీర్రాజు, ఉపాధ్యాయ సంఘ నేత అద్దరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## స్వామివార్ల సన్నిధిలో జడ్జిలు

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్ కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద న్యాయమూర్తి కృష్ణ మోహన్‌కు పూర్ణకుంభంతో అర్చకులు, వేద పండితులు స్వాగతం పలికారు. పూజలు అనంతరం న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటంను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ అందజేశారు.

**అప్పనపల్లిలో..**

**మామిడికుదురు:** రాజమహేంద్రవరం 8వ జిల్లా జడ్జి వై.బెన్నయ్యనాయుడు శనివారం అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బెన్నయ్యనాయుడు పేరిట ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఈఓ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆయనకు స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట అమలాపురం టౌన్ సీఐ వీరబాబు ఉన్నారు.


అంతర్వేది ఆలయంలో స్వామి చిత్రపటం అందుకుంటున్న న్యాయమూర్తి కృష్ణమోహన్

## నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

**అంబాజీపేట:** వాహనాలు నడిపే సమయంలో రహదారి నిబంధనలు పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఆ బైక్‌ను సీజ్ చేస్తామని రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి డి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి అధ్యక్షతన రోడ్డు, ఫుడ్ సేఫ్టీలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆర్టీవో శ్రీనివాస్ మాట్లాడుతూ మైనర్లకు బైక్‌లు ఇస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనం నడిపేవారంతా తప్పనిసరిగా హెల్మెట్ వాడాలన్నారు. వాహనాలకు సంబంధిత రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. లేని పక్షంలో సీజ్ చేస్తామన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఎం.ఉదయ్‌భాస్కర్, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వై.రామయ్యలు మాట్లాడుతూ ఆరుబయట విక్రయించే దుకాణాల్లో నిల్వ ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం పాడవుతుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎస్సై కె.చిరంజీవి, హెచ్ఎం కడలి సాయిరామ్, ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, డీసీపీసీ సభ్యులు బీవీవీ సత్యనారాయణ, ఎ.అమరేశ్వరరావు, ఎం.శ్రీనివాస్‌నగేష్, నక్కా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


అంబాజీపేటలో రోడ్, ఫుడ్ సేఫ్టీపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు


## వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు

**ఆలమూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో శనివారం కిక్కిరిసిపోయాయి. భక్తులు ఆలయ ఆవరణలో గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి భక్తులతో పాటు స్థానిక నూకాంబికా అమ్మవారి తీర్థోత్సవాలు జరుగుతున్న దృష్ట్యా ఆలయానికి భక్తుల తాకిడి అధికమైంది. దీంతో గంటల తరబడి క్యూలో వేచియున్న భక్తులు పురాతన చరిత్ర కలిగిన చింతలూరు, నర్శిపూడి, గుమ్మిలేరు వేంకటేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చింతలూరులో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్న భక్తులకు యథావిధిగా శనివారం అన్నదానం జరిగింది.

**నల్లచెరువులో..**

**అయినవిల్లి:** మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

**ఘనంగా చండీహోమం**


ఆలయంలో నిర్వహిస్తున్న చండీహోమం

**ఆలమూరు:** మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో శనివారం వైభవంగా చండీహోమం జరిగింది. శ్రావణ, పోలాల అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని దేవదాయశాఖ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు. అనంతరం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ ఆవరణలో ప్రతి నెలా అమావాస్య రోజున చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఉండవల్లి వీర్రాజుచౌదరి తెలిపారు. ఈ హోమంలో పాల్గొనే భక్తులు స్థానిక దేవదాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## క్లుప్తంగా

### హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ

**పి.గన్నవరం:** జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ స్కీమ్ ప్రతినిధులు శనివారం పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఎయిడ్స్ నియంత్రణపై సైకిలు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సంస్థ ప్రతినిధులు ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పీవీవీ లక్ష్మీ దేవి, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ స్కీమ్ జోనల్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, లింక్ వర్కర్ ఏసుకుమారి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు మలికిపురం విద్యార్థి

**మలికిపురం:** త్వరలో తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు మలికిపురం ఎయిడెడ్ డిగ్రీ కళాశాల బీకాం ఫైనలియర్ విద్యార్థి నెక్కంటి దిలీప్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎన్.ఆనంద మహాని శనివారం తెలిపారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 11న అమలాపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించి.. కాకినాడలో జరిగిన జోనల్ స్థాయి బాక్సింగ్ పోటీల్లో 65 కేజీల విభాగంలో ఉత్తమ ప్రతిభను కనపరిచి బంగారం పతకం సాధించిన దిలీప్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆమె చెప్పారు. కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో చైర్మన్ రుద్రరాజు పద్మరాజు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చిట్టాల సత్యనారాయణ, పీడీ పీడీకే ప్రసాద్ తదితరులు పాల్గొని దిలీప్‌ను అభినందించారు.

### రేపు మాధవ్ పర్యటన

**మలికిపురం:** రాజోలు నియోజకవర్గం బీజేపీ నాయకుల సమావేశం నియోజకవర్గ అధ్యక్షుడు అడబాల రాంబాబు అధ్యక్షతన బట్టేలంకలో కొమరగిరి శ్రీనివాస్ ఇంటి వద్ద శనివారం సమావేశం జరిగింది. నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాళ్ళ దొరబాబు పాల్గొని మాట్లాడుతూ ఈనెల 25న అమలాపురంలో జరిగే రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని అమలాపురంలో జరిగే శోభాయాత్ర, చాయ్‌పే చర్చ, బహిరంగ సభలో పాల్గొంటారని అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### గణపతి మండపాలకు అనుమతి తప్పనిసరి

**సఖినేటిపల్లి:** రానున్న చవితి మహోత్సవాల్లో గణపతి మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి విధిగా తీసుకోవాలని ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు అన్నారు. శనివారం సఖినేటిపల్లి పీఎస్‌లో ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వీటి నిమిత్తం పోలీసు శాఖ అందుబాటులో ఉంచిన వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకుని, ఎన్‌వోసీ తీసుకుని సదరు మండపాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై హితవు పలికారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**అంబాజీపేట:** ప్రస్తుత వర్షాకాలంలో దోమలను నివారించేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి కేవీఎస్ శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీలో సీహెచ్‌వో బి.అప్పారావు అధ్యక్షతన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మలేరియా, ఫైలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికున్‌గున్యా, విషజ్వరాలు వస్తాయని వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతకుముందు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పీహెచ్‌సీలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పీహెచ్ఎ భాగ్యలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### భారీ అన్నసమారాధన

**కొత్తపేట:** మండలంలోని వానపల్లిలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి చక్రధరాచార్యులు, వేద పండితులు స్వామి, అమ్మవార్లకు వివిధ పూజలు నిర్వహించారు. ఈనెల 18న శ్రావణ బహుళ దశమి పర్వదినం పురస్కరించుకుని ఆలయ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించిన విషయం తెలిసిందే. ఆరోజు నిర్వహించవలసిన అన్నసమారాధన తుపాను, వర్షాల కారణంగా వాయిదా వేశారు. ఆ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మండలంలో వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ, గ్రామస్తులు, వానపల్లి, కొత్తపేట, వాకాడవారిపాలెం సత్యసాయి సేవాసమితుల సభ్యులు వలంటీర్ సేవలు అందించారు.

### ఘనంగా టంగుటూరి జయంతి

**మలికిపురం:** తెలుగువారిలో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చిన ధీరోదాత్తుడు, తెలుగుజాతి సాహసానికి ప్రతీక టంగుటూరి ప్రకాశం పంతులు అని ఆయన జయంతి సందర్భంగా మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల చైర్మన్ రుద్రరాజు పద్మరాజు అన్నారు. కళాశాలలో టంగుటూరి జయంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.ఆనంద మహాని, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చిట్టాల సత్యనారాయణ, పీడీ ప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి.సూర్యనారాయణరాజు, రమేష్ బాబు, సీనియర్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.